# ముందుచూపు

తెల్లవారుఝాము అయిదు గంటలు. అప్పుడే ట్రెయిన్ దిగిన కేశవరావు, అతని కూతురు అపర్ణ స్టేషన్ బయటికొచ్చారు. ఒక్కసారిగా చలిగాలి రివ్వున తగిలింది. మంచు దట్టంగా ఉండటంతో హోర్డింగ్‌ల మీద అక్షరాలు కనబడటం లేదు. అప్పటికే నలుగురైదుగురు "సార్...రిక్షా కావాలా సార్..." అంటూ వెంట బడ్డారు. ఇద్దరు "ఆటోసార్..ఆటో" అన్నారు. ఓ పది గజాలు ఏమీ మాట్లాడకుండా నడిచిన కేశవరావు, తనని ఇంకా వెంబడిస్తున్న ఇద్దరినీ ఉద్దేశించి- "ఫలానా కాలేజీకి...ఎంత ఇమ్మంటావ్" అన్నాడు.

"పదిహేను రూపాయలు...రండిసార్" అన్నారు ఇద్దరూ.

"పదిహేనెందుకయ్యా! పది ఇస్తాను" బింకంగా అన్నాడు కేశవరావు. ఆ రిక్షావాళ్లల్లో ఒకతను మాట్లాడకుండా వెళ్లిపోయాడు. రెండో వాడు.."పన్నెండు ఇప్పించండి..సార్" అన్నాడు. "కుదరదయ్యా...వస్తే రా..లేకపోతే లేదు.." అంటూ అడుగు ముందుకి వెయ్యబోయాడు. "సరే...రండిసార్..." అంటూ సూట్‌కేస్ తీసుకున్నాడు వాడు. తప్పదు మరి... రాత్రి అన్నం తినడానికి డబ్బులు లేక టిఫినే చేశాడు. ఇప్పుడు ఈ బండికి పాసింజర్స్ దొరక్కపోతే ఎనిమిదింటి దాకా మళ్లీ బండి లేదు. వచ్చినా...అప్పుడూ పాసింజర్స్ దొరక్కపోతే.. అప్పటి దాకా ఆగేట్టు లేదు ఈ ఆకలి...అందుకే వచ్చిన బేరాన్ని ఒప్పేసుకున్నాడు.

పావుగంటకి కూడా కాలేజీ రాకపోయేసరికి "దూరం చాలా ఉన్నట్టుంది డాడీ..." అంది అపర్ణ.

"అవును...కనీసం ఐదు కిలోమీటర్లుంది...చవగ్గానే వచ్చాడు" మెల్లగా స్వరం తగ్గించి అన్నాడు కేశవరావు.

"అదేంటి డాడీ?" కొంచెం బాధగా అంది. ఇది ఒక రకంగా శ్రమదోపిడీయే అనిపించి ఏదోలా ఉంది మనసు. 'ఏంటో మనుషులు కొన్ని విషయాల్లో ఆలోచన అనేది లేకుండా ఖర్చు చేస్తారు గానీ...కొన్నింటిలో ఎంత ఇదిగా ఉంటారో' అనుకుంది.

"అవునమ్మా...మన తెలివితేటలు అలాంటప్పుడే ఉపయోగించాలి. జనం ఎక్కువ లేరు. వాడికి కిరాయి అవసరం. చచ్చినట్టు మనం చెప్పిన రేటుకి వస్తారు. డిమాండ్-సప్లయ్ సూత్రం అమ్మా...నువ్వు చదువుకున్నావు కదా!" మెల్లగా...గర్వం తొణికిసలాడుతుండగా అన్నాడు.

* * *

అప్పటికే అడ్మిషన్ కౌంటర్ దగ్గర క్యూ ఏర్పడింది. అపర్ణతో సహా వెళ్లి క్యూలో నుంచున్నాడు. తొమ్మిదింటికి ప్రిన్సిపాల్ ఇంటర్వ్యూ దొరికింది.

"సార్...మా అమ్మాయిని ఇంటెన్సివ్ బేచ్‌లోకి తీసుకోండి ప్లీజ్" అన్నాడు.

"నో...నో...కుదరదండీ..ఓన్లీ ట్వంటీ సీట్స్..ఆల్‌రెడీ ఫిల్డ్ అప్.." అన్నాడు ప్రిన్సిపాల్.

"ప్లీజ్ సార్..తప్పదు సార్..చాలా దూరం నుంచి వచ్చాం సార్..పాతికవేలు కాకపోతే నలభై వేలు తీసుకోండి" బ్రతిమలాడుతున్నాడు.

సడెన్‌గా అంది అపర్ణ-"డాడీ...ఒక్కసారి బయటకు రండి"

ఆశ్చర్యంగా కూతురి వంక చూశాడు కేశవరావు.

"అర్జెంట్ డాడీ" అంది.

"ఎక్స్‌క్యూజ్‌మీ సార్...ఒన్ మినిట్" అని ప్రిన్సిపాల్ కేసి చూసి... బయటకు నడిచాడు.

బయటికొచ్చాక-"డాడీ...నేను ఈ కాలేజీలో చేరను"

"అదేంటమ్మా?"

"అసలు ఎం.బి.బి.ఎస్. చదవటానికే ప్రయత్నించను"

"ఆ..."

"అవును డాడీ...కోచింగ్‌కే ఇంత ఖర్చు చేసి... సీటు వస్తే మరిన్ని లక్షలు ఖర్చ చేస్తావు. అప్పటికి నేను కేవలం మెడికల్ గ్రాడ్యుయేట్‌ని అవుతాను. పీజీ చేసిన డాక్టర్లు వీధికొకరు. కార్పొరేట్ హాస్పిటల్స్ ఊరికొకటీ ఉన్నాయి ఇప్పటికే! నా చదువు అయ్యేసరికి ఎంత కాంపిటీషన్ ఉంటుందంటే...నేను పీజీ.. ప్లస్ స్పెషలైజేషన్ చెయ్యలేకపోతే ఉదయం మనం చూసిన రిక్షావాడిలా అయిపోతాను. ఆ రెండూ చెయ్యాలంటే నువ్వు ఆర్థికంగా ఎంత నలిగిపోతావో ఊహించగలను."

ఒక్క క్షణం ఆగింది...తెల్లబోయిన కేశవరావుతో- "సారీ డాడీ...కూతుర్ని డాక్టర్‌గా చూడాలన్న మీ ఆశయం నెరవేర్చలేనేమో కానీ...నాకిష్టమైన సబ్జెక్టులో...బాగా చదివి...డాక్టరేట్ సంపాదిస్తాను. కానీ 'డిమాండ్' బాగా ఉండే ఫీల్డ్‌లోనే...నన్ను నమ్మండి."

నన్నటి కన్నీటిపొర.. చేతులు పట్టుకుంది. తను ఎకనామిక్స్‌ని అయిదు రూపాయల దోపిడీకి ఉపయోగించుకుంటే అపర్ణ జీవితాన్నే తీర్చిదిద్దుకోవడానికి అన్వయించుకోవటం కేశవరావుకి ఆశ్చర్యాన్నీ...ఆనందాన్నీ కలిగించింది.

-బి.వి.పద్మరాజు (విజయవాడ)

లూను."

"లేకపోతే త్యాగరాజ కీర్తనలు వినమంటావా?"

"అవి కాకపోతే కాస్తంత మంచి పాటలన్నా వినొచ్చు కదా! ఆ పిచ్చిగోల మధ్యలో ఏం తోస్తుందే బాబూ!"

"ఏదో వాళ్లలవాట్లు వాళ్లవి"

"నువ్వెన్నన్నా చెప్పు. మునుపటి రోజులే నయం."

"అప్పుడు మనం విన్న పాటలన్నీ మన పెద్దాళ్లు తిట్టలేదేంటి?"

"వాళ్లు తిట్టినా ఎంత కమ్మటి పాటలవి!"

"అప్పుడు మన టేస్టు మన పెద్దాళ్లకి నచ్చలేదు. ఇప్పుడు మన పిల్లల టేస్టులు మనకి నచ్చటం లేదు అంతే!"

"ఏం కాదు. అప్పుడు పాటలు వినడానికీ బాగుండేవి. మళ్లీ పాడుకోడానికీ బాగుండేవి. ఇప్పుడు పాటల్లో ఒక్క ముక్కా అర్థం కావట్లేదు"

"పోనీ పాటల గురించొదిలెయ్! మన పెద్దాళ్లు మనల్నెంత క్రమశిక్షణతో పెంచారని? ఎంత బుద్ధిగా ఉండేవాళ్లం! ఇప్పుడు పిల్లలకి భయమూ భక్తీ రెండూ లేవు."

"వెధవ్వేషాలేస్తే నాన్న వీపు చీరేస్తాడనే భయమే క్రమశిక్షణ? కొడుకు బుద్ధిమంతుడుతనం నాన్న పెరట్లోకి వచ్చేవరకే"

"ఏం కాదు. నాన్నంటే భయపడి చచ్చేవాళ్లం. నాన్నకి తెలీకుండా ఎప్పుడైనా ఒక్కమారైనా సినిమాకి పోవాలంటే గుండెలు దడదడలాడేవి"

"అప్పుడు టౌన్‌కు పోతేగానీ సినిమాకి దిక్కు లేదు. ఇప్పుడు టీవీ పెట్టుకుంటే రోజూ వంద సినిమాలు"

"అంటే ఏంటే నీ ధోరణి. మనమంతా బుద్ధిగా ఉండలేదంటావా?"

"అవకాశం లేక. నువ్వోట్టి రౌడీ వెధవ్వి కాకపోయేవాడివా?" నేనేదో పిల్లల గురించి చెపుతుంటే ఇది నన్ను ఏకిపారేస్తోంది. నాకేం చెప్పాలో తెలీలేదు.

"ఏం కాదు"

"ఎందుకని కాదు?"

"నేను ఒక పద్ధతిగా పెరగబట్టే ఇవాళ ఇంత సుఖంగా ఉన్నాను"

"అంటే"

"అంటే ఏముంటుంది చెప్పుకోవడానికి ఎవడి జీవితంలోనైనా ఉన్నవే చెప్పటం మొదలెట్టాను"

"మంచి ఉద్యోగం, పెళ్లాం, పిల్లలు, ఇల్లు, వాకిలి."

"బోడి. ఈమాత్రం ఎవడేనా చేస్తాడు."

"ఏం కాదు"

"పోన్లే."

మా సుజాత ఏదో ఒక వాత పెట్టకుండా 'పోన్లే' అనేసిందంటే నాకాశ్చర్యం వేసింది. గెలుపెవరిదో తేలలేదు. అందుకే సంభాషణ ఇంకా సాగదీశాను.

"ఈ కాలం పిల్లలు ఏవైతారో అనే నాకు దిగులుగా ఉంది. ఏమైనా మునుపటి రోజులే మెరుగు"

"అంటే నీ చిన్నప్పటి రోజులా?"

"అవును. ఆ మాటకొస్తే మా నాన్న రోజులు ఇంకా మెరుగు. ఇంకా ఇంకా వెనక్కి వెళ్లితే ఇంకెంతో మెరుగు. వాళ్లెంతో హాయిగా ఉన్నారు. వాళ్లకింత బాధుండేదా తమ పిల్లల గురించి? మనకే ఈ కష్టాలన్నీను"

"మీలాగే మన ముందువాళ్లంతా సుఖంగా ఉండేవారని అనుకునే వాళ్ల గురించి ఒకాయన చెప్పాడులే"

"ఎవరూ?"

"గురజాడ 'మీ పేరేమిటి?' కథలో"

"ఏం చెప్పాడు?"

"ఆ పీనుగులూ మనలాగే ఏడుస్తూ ఉండేవారు"

-నేతి సూర్యనారాయణశర్మ
(హైదరాబాద్)